క్లుప్తంగా

రైతులకు అందుబాటులో వ్యవసాయ పరికరాలు

చేవెళ్ల: మండలంలో రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని, వాటి కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.శంకర్‌లాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై, మిగితా రైతులకు 40 శాతం సబ్సిడీపై బ్యాటరీ స్ప్రేయర్ - 175, పవర్ స్ప్రేయర్ -24, రోట వేటర్లు -9, కల్టివేటర్లు, కేజీ వీల్స్, ఎంబీ ప్లౌ, డిస్క్ హారో, రోటో పడ్లర్ -11, ట్రాక్టర్‌తో ఎరువులు, విత్తనాలు వేసే డ్రిల్స్-2, బండి ఫార్మర్ -1, పవర్ వీడర్ -1, బ్రష్ కట్టర్ -3, పవర్ టిల్లర్ -1, మొక్కజొన్న షెల్లర్ -1, స్ట్రా బెలర్ -2 తదితర వ్యవసాయ పనిముట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫొటో, ట్రాక్టర్‌తో నడిచే పనిముట్లకు ట్రాక్టర్ ఆర్సీని జతపరిచి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి ఇవ్వాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

చేవెళ్ల: గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు మండల పరిధిలోని ఆలూరు గ్రామానికి చెందిన షాబాద్ పెంటయ్య ఇల్లు కూలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి తనవంతు సహాయంగా రూ.50వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు ఆ నగదును మాజీ ప్రజాప్రతినిధులు బాధితులకు అందజేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే కాలె యాదయ్యతో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని బాధితుడికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డమీది పెంటయ్య, మాజీ సర్పంచ్‌లు అనంత రాములుగౌడ్, కవ్వగూడం విజయలక్ష్మీనర్సింలు, మాజీ ఎంపీటీసీ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల నిర్వహణకు చర్యలు

ఎంపీడీఓ సుమతి


మాట్లాడుతున్న సుమతి

నందిగామ: భారీ వర్షాలు కురిసిన సందర్భంగా సీజనల్ వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని, గ్రామ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో పరిసరాలను, మురుగు కాల్వలను పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుమతి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, మురుగు కాల్వలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేయించాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో వార్డుల వారీగా బూత్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ తేజ్‌సింగ్, గ్రామ కార్యదర్శులు చక్రధర్‌గౌడ్, జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. బోనాల ఉత్సవం


కాకునూర్‌లో బోనాలతో ఆలయం వద్ద మహిళలు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ, చింతకుంటపల్లి, పోమాల్‌పల్లి, మంగళిగూడ, సంతాపూర్, కాకునూర్, ఇప్పలపల్లి, చౌలపల్లి గ్రామాల్లో శ్రావణమాస బోనాలను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపు ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేములనర్వలో బోనాల సందర్భంగా గ్రామానికి చెందిన వన్నాడ అర్చన, రమేశ్‌గౌడ్ దంపతులు సుమారుగా రూ.40వేల విలువ గల వెండి కిరీటం, వడ్డాణంను మైసమ్మ అమ్మవారికి బహూకరించారు. కార్యక్రమంలో వన్నాడ వరలక్ష్మీమనోహర్‌గౌడ్, రాజేశ్వరీఅర్చకుడు వేణుగోపాల్‌శర్మ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో బోనాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.


కొందుర్గు బాలికల ప్రాథమిక పాఠశాల దుస్థితి

శిథిల బడులు.. భయంగా చదువులు

- పెచ్చులూడి పడుతున్న పాఠశాల భవనాల పైకప్పులు
- భయాందోళనకు గురవుతున్న తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు

కొందుర్గు: శిథిలావస్థకు చేరిన బడుల్లో విద్యార్థులు భయం భయంగా చదువులు కొనసాగిస్తున్నారు. అదేవిధంగా కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు పాఠశాలల్లో అన్ని వసతులు సమకూర్చుతున్నామని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తున్నాం అంటూ నాయకులు ప్రసంగాలు చేస్తుంటారు. కానీ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేకపోవడం, భవనాలు శిథిలావస్థకు చేరి పైకప్పులు పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ పాఠాలు వింటున్నారు. అదేవిధంగా విద్యాబోధన చేయడానికి ఉపాధ్యాయులు కూడా సరిగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.

మండలాల్లో పాఠశాలలు..

కొందుర్గు మండలంలో 23 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 2 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో దాదాపు 2వేలపైనే విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 28 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 4 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 2,500 మంది విద్యార్థులు చదువుతున్నారు.

శిథిలావస్థకు చేరి.. ప్రమాదకరంగా మారి

మండలంలోని చాలా గ్రామాల్లో పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలిపడతాయో అనే చందంగా మారాయి. కొందుర్గు మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాల, రామచంద్రాపూర్, లాలపేట, కొత్త ఆగిర్యాల, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని చేగిరెడ్డి ఘనాపూర్, ఎల్కగూడ, తూంపల్లి, పద్మారం, పీర్జాపూర్, గుంజల్‌పహాడ్, చలివేంద్రంపల్లి, వీరసముద్రం, రావిర్యాల పాఠశాలల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ఇక తంగెళ్లపల్లి దళితవాడ, రాంజాతండా పాఠశాలలకు భవనాలే లేవు.

గ్రామాల్లో ఉద్యోగాలు.. పట్టణాలకు డిప్యూటేషన్లు

ఈ మండలాలకు ఇటీవల బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు గ్రామాల్లో ఉద్యోగాలు.. పట్టణాలకు డిప్యూటేషన్లు అన్న చందంగా మారింది. జిల్లాలో మారుమూల మండలాలు కావడంతో అసలే ఉపాధ్యాయుల కొరత వేధిస్తుండగా ఇటీవల బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు చాలామంది పట్టణాలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో విద్యాబోధన కుంటుపడుతోంది. కొందుర్గు మండలం లక్ష్మీదేవునిపల్లి పాఠశాలలో పనిచేస్తున్న హతిరామ్ అనే ఉపాధ్యాయుడిని ఆరుట్ల పబ్లిక్‌స్కూల్‌కు డిప్యూటేషన్‌పై పంపారు. అదేవిధంగా యూపీఎస్ ఆగిర్యాల నుంచి చంద్రశేఖర్‌రెడ్డిని వయోజన విద్యావిభాగానికి, ఉమ్మెంత్యాల నుంచి నరేందర్‌రెడ్డిని డిప్యూటేషన్‌పై పంపారు. ఇక ఇటీవల చెర్కుపల్లి పాఠశాల నుంచి సుష్మా అను ఉపాధ్యాయురాలు గండిపేటకు డిప్యూటేషన్‌పై వెళ్తే గ్రామస్తులు, విద్యార్థులు ఏకంగా కొందుర్గు రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. కానీ డిప్యూటేషన్ మాత్రం రద్దు కాలేదు. కొందుర్గు మండల కేంద్రంలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలిని చెర్కుపల్లి పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు.


ఆగిర్యాల పాఠశాల తరగతి గదిలో పెచ్చులూడి పడుతున్న పైకప్పు

భయంగా ఉంది



మా పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. ఎప్పుడు కూలిపడుతుందో అనే భయంతో చదువుకుంటున్నాం. చుట్టూ పరిసరాలు కూడా అధ్వానంగా ఉన్నాయి. చెట్లు, ముళ్ల పొదలతో కమ్ముకున్నాయి. తరగతి గదుల్లోకి విషపూరిత కీటకాలు వస్తున్నాయి. పాఠశాలకు వెళ్లాలంటేనే భయంగా ఉంది.

– రిత్విక్, 7వ తరగతి విద్యార్థి, యూపీఎస్, ఆగిర్యాల

అధికారులు పట్టించుకోవడం లేదు

పాఠశాల శిథిలావస్థకు చేరిన విషయం ఇదివరకే పలుమార్లు అధికారులకు తెలిపాం. ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఫలితం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏమవుతుందో తెలియని పరిస్థితి. విద్యార్థులపై శిథిలాలు పడితే ప్రమాదాలు తప్పవు.

– గూడెం చెన్నయ్య, ఆగిర్యాల

బీసీల హక్కుల సాధనకు పోరాటం

బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ


అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న బర్క కృష్ణ, నాయకులు

షాబాద్: బీసీల హక్కుల సాధనకు నిరంతర పోరాటం చేస్తామని, జనాభాలో అత్యధికంగా బీసీలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని కక్కులూర్‌లో బీసీసేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం బీసీసేన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాజేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా కావలి శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం, యువజన కమిటీ అధ్యక్షుడిగా చాకలి తిరుపతి, ఉపాధ్యక్షుడిగా జింకల శివశంకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మంగలి నర్సింలు, కోశాధికారిగా పట్నం శెట్టి మోహిత్, కార్యదర్శిగా చాకలి పురుషోత్తంను ఎన్నుకున్నారు. బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలంతా పోటీకి సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీసీసేన జిల్లా ఉపాధ్యక్షుడు మేకల వెంకటేశ్, సోషల్ మీడియా అధ్యక్షుడు నర్సింలు, బీసీ సేన మండల అధ్యక్షుడు కమ్మరి దయాకర్‌చారి, ఉపాధ్యక్షుడు మీరంపల్లి బాల్‌రాజ్, మండల యువజన విభాగం అధ్యక్షుడు అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వృద్ధులను బాధ్యతగా చూసుకోవాలి


షాద్‌నగర్‌రూరల్: వృద్ధులను సన్మానిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శ్యామల

షాద్‌నగర్‌రూరల్: వృద్ధుల ఆరోగ్య సంరక్షణ, సంక్షేమంతో పాటు వారిని బాధ్యతగా చూసుకోవాలని కమ్మదనం గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శ్యామల విద్యార్థులకు సూచించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ విద్యుల్లత ప్రోత్సాహంతో వైస్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ తల్లిదండ్రులు, అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలతో కలిసి ఫొటోలు దిగుతూ, ఆటాపాటలతో సరదాగా గడిపారు. వృద్ధు తమ అనుభవాలను పిల్లలతో పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో వృద్ధులు తమ కుటుంబ సభ్యులకు భారమవుతున్నారని, బంధాలను దగ్గర చేసేందుకు ప్రతీ విద్యార్థి కృషి చేయాలని సూచించారు. పెద్దల పట్ల ప్రేమ, ఆప్యాతలు లేకపోవడం, ఉద్యోగాల పేరుతో తమ పిల్లలు దూరంగా ఉండటంతో కొడుకులు, కోడళ్లు దూరమైపోతున్నారన్నారు. పాత తరాల వారితో బంధాలు, అనుబంధాలను కొనసాగించడంతో పిల్లలకు మానవ సంబంధాలపై నమ్మకం పెరుగుతుందన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ద్వారా చిన్నారుల్లో కుటుంబ విలువలను పెంపొందించవచ్చన్నారు. అనంతరం వృద్ధులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల, పాఠశాలలో..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల కళాశాల, పాఠశాలలో జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రణిత ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తాతలు, అమ్మమ్మలు, నానమ్మలు, తల్లిదండ్రులు పాల్గొని సందడి చేశారు. వారికి క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం వృద్ధులందరినీ సన్మానించి.. స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

జిమ్స్ డాక్టర్ విరాజ్‌కుమార్

నందిగామ: ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వాతావరణంలో వచ్చే మార్పులతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిమ్స్ డాక్టర్ విరాజ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడ గోవిందు పోచయ్య కాలనీలో గురువారం జిమ్స్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిమ్స్ వైద్యబృందం ఆధ్వర్యంలో కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని, ఇన్ఫెక్షన్లు, శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. జ్వరం వచ్చినట్లయితే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ శిబిరంలో 65 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు విష్ణు బాంధవి, సుష్మ, పూజ, శివాణి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేశ్


విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేశ్

కొత్తూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. పట్టణంలోని కేజీబీవీ హాస్టల్ ఆవరణలో గురువారం మేరా యువ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కలిసి హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణం, పరిరక్షణ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ప్రతి ఒక విద్యార్థి 'ఏక్ పేడ్ మాకే నామ్' ఒక మొక్కను తమ తల్లి గుర్తుగా నాటి ఆమె జ్ఞాపకంగా దాన్ని పెంచాలని సంస్థ నిర్వాహకులు సూచించారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న పలు మార్పులకు ప్రాధాన కారణం కాలుష్య ప్రభావమన్నారు. చెట్లు, అడవుల పెంపకంతో సాధ్యమైనంత వరకు కాలుష్యాన్ని తగ్గించవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోనే సరిపెట్టకుండా వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌యాదవ్, సంస్థ ప్రతినిధులు శ్రీశైలం, రవి, స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ప్రొద్దటూరు నుంచి మోకిల వెళ్లే రోడ్డు దుస్థితి


మోకిల-కొండకల్ రహదారిలో కోతకు గురవుతున్న తారు రోడ్డు

రోడ్లు ధ్వంసం.. ప్రయాణం నరకం

హైదరాబాద్ మహానగరానికి కూతవేటు దూరంలో ఉన్న మోకిలలో ఇటీవల కురిసిన వర్షానికి రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. ఎటు చూసినా రోడ్లపై గుంతలు, ఆపై వాటిల్లో వర్షపునీరు, రోడ్లపై పేరుకుపోయిన మట్టి దిబ్బలు, కోతకు గురైన రోడ్లు దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఈ దారుల్లో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి, రోడ్లను మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– శంకర్‌పల్లి


బురదమయంగా మోకిల నుంచి విల్లాలకు వెళ్లే దారి

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కేశంపేట: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం వరంలాంటిదని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లికి చెందిన బాలయ్యకు, లేమామిడికి చెందిన వెంకట లక్ష్మమ్మకు సీఎంఆర్‌ఎఫ్ నుంచిమంజూరైన చెక్కులను గురువారం ఆయన అందజేశారు. అదేవిధంగా తొమ్మిదిరేకుల, లేమిమామిడి గ్రామాల్లో పలువురు అనారోగ్యాలకు గురికావడంతో ఆయన వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. నిర్దవెల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తన సొంత నిధులతో మరుగుదొడ్లు నిర్మించి ఇస్తానని ఆయన వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్, మాజీ వైస్‌ఎంపీపీ సురేందర్, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చెరువు వద్ద ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు

షాబాద్: చెరువులు నిండడంతో అన్నదాతల్లో ఆనందం వెల్లి విరిసిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పహిల్వాన్ చెరువు అలుగు వద్ద మత్స్యకారులు, రైతులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండి జలకళ సంతరించుకుందన్నారు. దీంతో భూగర్భజలాలు పెరిగి బోరుబావుల్లో పుష్కలంగా నీరు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మాజీ సర్పంచ్‌లు మునగపాటి నర్సింలు, జనార్దన్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లింగం, నాయకులు తదితరులు ఉన్నారు.

ఉల్లాస్‌పై శిక్షణ

కేశంపేట: మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఉల్లాస్‌పై వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు, గ్రామ రిసోర్స్ పర్సన్స్‌కు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, ఎంఈఓ చంద్రశేఖర్ పాల్గొని ఉల్లాస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 15 ఏళ్లకు పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి వారికి కనీస సామర్థ్యాలను నేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం కవిత, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేడు మండల ప్రజావేదిక

కొందుర్గు: ఉపాధిహామీ పనుల నిర్వహణకు సంబంధించిన సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఏపీఓ నర్సింగ్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై వారం రోజులు గ్రామాల్లో సామాజిక తనిఖీ చేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ప్రజావేదిక నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీఓ శ్రీలత హాజరవుతారని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

టీఎస్‌యూటీఎఫ్ నాయకుడు రఘుపాల్

కొత్తూరు: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకుడు రఘుపాల్ కోరారు. ఇందులో భాగంగా గురువారం ఆయన మండలంలోని పెంజర్లలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులతో కలిసి ఈ నెల 23న హైదరాబాద్‌లో చేపట్టనున్న మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాధర్నాకు పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సాయన్న, ప్రిన్స్, శ్రీనివాస్, గౌరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు కోరారు. గురువారం పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ మనోహర్ ఆధ్వర్యంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ నాయకులు వెంకటయ్య, నర్సింలుగౌడ్, అర్జునప్ప, రవీంద్రనాథ్, చంద్రశేఖర్, మధు, మోహన్, భరత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిశీలన

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ ఏడాది నుంచి 1000 ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించేందుకు సిద్ధమైంది. దాంట్లో భాగంగా శంకర్‌పల్లి మండలంలోని మాసానిగూడ, మహాలింగాపురం, గాజులగూడ, అంతప్పగూడ, జన్వాడ గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసింది. వీటిని గురువారం ఎంఈఓ అక్బర్ పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, ఆడుకోడానికి మైదానం తదితర విషయాలపై ఆరా తీసి, తీసుకోవాల్సిన చర్యలను గూర్చి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పరిశీలన తర్వాత తుది నివేదికను జిల్లా విద్యాధికారికి ఇవ్వనున్నట్లు ఎంఈఓ తెలిపారు.